సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 21 । మార్చి । 2023



సీతంపేటలో వడగండ్ల వాన

సీతంపేట: సీతంపేటలో సోమవారం మధ్యాహ్నం వడగండ్ల వర్షం కురిసింది. దీని ప్రభావంతో జీడి, మామిడి పిందెలు రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



అడవులతో ఆరోగ్యకర జీవనం

మనిషికి ప్రాణవాయువును అందించేవి చెట్లు. పర్యావరణ సమతుల్యతకు అడవులే ప్రధానం. వాటితోనే మానవ జీవనం ముడిపడి ఉంది.

- 8లో



ట్రాక్టర్ల చోరీ నిందితుల అరెస్ట్

జిల్లాలో ట్రాక్టర్ల దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఒక ట్రాక్టర్ ఇంజిన్, మూడు ట్రక్కులు, రూ.4.50 లక్షలు నగదు రికవరీ చేసినట్లు ఎస్పీ ఎం.దీపిక స్పష్టం చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

కోటదుర్గమ్మ హుండీల ఆదాయం లెక్కింపు



కోటదుర్గమ్మ దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

పాలకొండ రూరల్: దేవదాయశాఖ ఆధ్వర్యంలో పాలకొండలోని పలు ఆలయాల హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. దేవదాయశాఖ జిల్లా అధికారి డి.అప్పలనాయుడు పర్యవేక్షణలో లెక్కింపు సాగింది. పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానంలో 46 రోజుల హుండీల ఆదాయం రూ.5,74,737 వచ్చింది. అలాగే, జగన్నాథ స్వామి ఆలయ హుండీల నుంచి రూ.1,602, ఎస్.కె.రాజపురంలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి రూ.10,418, అన్నవరం గ్రామంలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం హుండీ ద్వారా రూ.39,619 సమకూరినట్టు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ కార్యనిర్వాహణాధికారి వి.రాధాకృష్ణ, గ్రూపు దేవాలయాల అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

4 లక్షల టన్నుల చెరకు క్రషింగ్



కర్మాగారానికి ట్రాక్టర్‌పై చెరకును తరలిస్తున్న రైతు

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో 4 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయిందని కర్మాగారం అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎ.నాగేశ్వరరెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరకు పంట నరికేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం వాతావరణం బాగుండడంతో అన్ని గ్రామాల్లో చెరకు నరికేందుకు రైతులు ముందుకొచ్చారని, ప్రతిరోజు సుమారు 4వేల టన్నుల చెరకు క్రషింగ్ చేస్తున్నట్టు వెల్లడించారు. కర్మాగారానికి చెరకును తరలించిన వారం రోజులకే రైతుల ఖాతాలకు బిల్లులు జమ చేస్తున్నామన్నారు. రైతుల సంక్షేమమే ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం ధ్యేయమని పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు పదో తరగతి ప్రశ్నపత్రాలు



గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరుస్తున్న ప్రశ్నపత్రాలు

గరుగుబిల్లి: వచ్చేనెల 3 నుంచి జరగనున్న పదోతరగతి పరీక్షల ప్రశ్నపత్రాలు గరుగుబిల్లి పోలీస్ స్టేషన్‌కు సోమవారం చేరాయి. ప్రత్యేక వాహనంలో చీఫ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఎస్‌ఐ రాజేష్‌కు ప్రశ్నపత్రాలను అప్పగించినట్టు ఎంఈఓ ఎస్.నాగభూషణరావు తెలిపారు. మండలంలోని గరుగుబిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, రావివలస జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు

- ఆర్డీఓ సూర్యకళ



శ్రీరామనవమి వేడుకలపై సమీక్షిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వ లాంఛనాలతో ఈ నెల 30న జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ సూర్యకళ ఆదేశించారు. రాములోరి సన్నిధిలో అన్ని శాఖల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు సుమారు 25వేల మంది భక్తులు వచ్చే అవకాశముందన్నారు. కల్యాణం అనంతరం తలంబ్రాల పంపిణీలో తోపులాటలు జరగకుండా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ రమణరాజు, ఈఓ ప్రసాదరావు, ఎస్సై నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్దలో.. రాగిజావ



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

- నేటి నుంచి విద్యార్థులకు రాగిజావ
- జిల్లాలోని 1225 పాఠశాలల్లో 82 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం
- వారానికి మూడు రోజుల పాటు వడ్డింపు
- విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయడమే ప్రభుత్వ లక్ష్యం

పార్వతీపురం:

జగనన్న గోరుముద్ద మెనూలో అధిక పోషక విలువలు కలిగిన మరో పౌష్టికాహారం కొత్తగా చేరనుంది. విద్యార్థుల కడుపునింపే ఆహార పదార్థాలకు బదులుగా బలవర్థక ఆహారం అందించి, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో మధ్యాహ్నభోజనం మెనూలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాగిజావను చేర్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వారంలో మూడు రోజుల పాటు రాగిమాల్ట్ (జావ) ఇవ్వాలని నిర్ణయించింది. విద్యపై అధిక శ్రద్ధ చూపుతూ రూ.వేల కోట్లు కేటాయింపులు చేస్తున్న ప్రభుత్వం, విద్యార్థులకు అధికపోషక విలువలతో పాటు రక్తహీనతను నివారించే రాగిజావను ఇచ్చేందుకు ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ నెల 21వ తేదీ నుంచి పార్వతీపురం మన్యం జిల్లాలోని విద్యార్థులకు రాగిజావను వడ్డించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఫోర్టిఫైడ్ బియ్యం, కోడిగుడ్లు, చిక్కీలు, ఆకుకూరలు, కూరగాయలతో కూడిన బలవర్థక ఆహారాన్ని ప్రతిరోజూ తృప్తిగా ఆరగిస్తున్న విద్యార్థులకు ఇప్పుడు రాగిజావ అదనపు శక్తిని ఇవ్వనుంది. బెల్లంతో కలిపి తయారు చేసే రాగిజావలోని పోషకాలు శరీరానికి శక్తిని, ఉత్సాహాన్ని ఇవ్వడంతోపాటు రక్తహీనతను నివారిస్తాయని వైద్యులు చెబుతున్నారు.

82వేల మంది విద్యార్థులకు లబ్ధి

పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 1,225 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 82 వేల మంది విద్యార్థులు జగనన్న గోరుముద్ద లబ్ధి పొందుతున్నారు. వీరికి ప్రతి మంగళ, గురు, శనివారాల్లో జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావ పంపిణీ చేయనున్నారు. ప్రతి విద్యార్థికి 150 మి.లీ. చొప్పున ఉదయం పాఠశాల ఆరంభానికి ముందు ఇవ్వనున్నారు.



రాగిజావతో ప్రయోజనాలెన్నో..

రాగిజావలో తక్కువ కొలెస్ట్రాల్, సోడియం ఉంటుంది. బీ కాంప్లెక్స్, విటమిన్ సీ,ఈ, థయామిన్, రైబోఫ్లావిన్, నియాసిన్, ఫోలిక్‌యాసిడ్, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్ అధికంగా ఉంటాయి. మనిషిలోని పోషకాహార లోపాన్ని నివారించడంలో రాగిజావ సహాయకారిగా ఉంటుంది. దీంతోపాటు శరీరంలోని వివిధ బాగాలకు ఆక్సిజన్ సరఫరా చేయడంలోనూ దీనిపాత్ర కీలకం. ఫైబర్ ఎక్కువగా ఉండడంతో ఎక్కువ సమయం ఆకలి వేయదు. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మానసిక ఆందోళన, నిద్రలేమి సమస్యలు తగ్గుతాయి. ఎముకలు గట్టిపడేందుకు, గుండె ఆరోగ్యం మెరుగుపడేందుకు, రక్తంలో గ్లూకోజ్‌ను తగ్గించేందుకు ఉపకరిస్తుంది.





విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రభుత్వం పేదకుటుంబాల పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధచూపుతోంది. ఓ వైపు అమ్మఒడితో ఆర్థిక ఆసరా కల్పిస్తోంది. జగనన్న విద్యాకానుకల కింద అభ్యసన సామగ్రిని సరఫరా చేస్తోంది. జగనన్నగోరు ముద్ద కింద రుచికరమైన భోజనం వడ్డిస్తోంది. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఎదుగుతారు. చదువులో రాణిస్తారు. రాగిజావను రుచికరంగా తయారుచేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీచేశాం. రాగిజావ తయారీకి కావాల్సిన ముడిసరుకులు పాఠశాలలకు చేరాయి. – ఎస్‌డీవీ రమణ, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

సివిల్ ఇంజినీరింగ్‌కు మంచి డిమాండ్

- సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని విద్యార్థులకు వీసీ పిలుపు
- జేఎన్‌టీయూ జీవీలో 'ప్రగతి టూకె 23' సదస్సు ప్రారంభం



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: సివిల్ ఇంజినీరింగ్‌కు మంచి డిమాండ్ ఉందని, కాలానుగుణంగా ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను విద్యార్థులు మెరుగుపరుచుకోవాలని జేఎన్‌టీయూ విజయనగరం గురజాడ (జీవీ) వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ప్రగతి టూకె 23' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియంను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్ చేసే విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. తరగతిగదిలో నేర్చుకున్న విజ్ఞానానికి అనుగుణంగా ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతానికి స్వచ్ఛమైన నీటి పంపిణీ వ్యవస్థను రూపొందించే అవకాశం సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉంటుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బి.ఉమాశంకర్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులపాత్ర కీలకమన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే టెక్నికల్ సింపోజియం సదస్సులకు హాజరయ్యే విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకునే అవకాశం ఉంటుందన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాసప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు టీవీఎస్ డి.ఫణీంద్రనాథ్, ఆర్.బాల మురళీకృష్ణ కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. స్టూడెంట్ కో ఆర్డినేటర్లుగా ఎం.అజయ్‌కుమార్, బి.సాయిచందన వ్యవహరించారు. వివిధ కళాశాలల నుంచి 80 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ప్రతిభావంతులకు పురస్కారాలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: గత నెల 26న యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా జిల్లాలో ప్రజ్ఞావికాస పరీక్ష నిర్వహించాయి. ఇందులో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ చేతులమీదుగా ప్రతిభ పురస్కారాలతో పాటు నగదు బహుమతులను సోమవారం ప్రదానం చేశాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు అమృతవర్షిణికి రూ.5వేలు, జె.గాయిత్రికి రూ.3వేలు, మణికంతకు రూ.2వేలు నగదును కలెక్టర్ అందజేశారు. పలువురు విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేసి, చక్కగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మురళీమోహన్‌రావు, భాస్కరరావు, డి.పండు, రాజశేఖర్ పాల్గొన్నారు.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. డివిజన్, మండల అధికారులతో సోమవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంజినీరింగ్ సహాయకులు రూఫ్ కాస్టింగ్(ఆర్‌సీ) దశలో ఉన్న ఇళ్లను ప్రతిరోజూ సందర్శించాలన్నారు. ఏప్రిల్ 15 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. రీసర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో జేసీ ఒ.ఆనంద్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, పీఆర్ ఎస్‌ఈ ఎంవీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూస్ ఎస్‌ఈ ప్రభాకరరావు, హౌసింగ్ పీడీ రఘురాం, డీపీఓ బి.సత్యనారాయణ, డుమా పీడీ రామచంద్రరావు పాల్గొన్నారు.

మిస్టర్ ఆంధ్రా చాంపియన్‌గా సంతోష్



మిస్టర్ ఆంధ్రా ఛాంపియన్ టైటిల్‌ను అందుకుంటున్న పడాల సంతోష్‌కుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా స్టార్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా జరిగిన 25వ మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం అర్ధరాత్రితో ముగిశాయి. చాంపియన్‌గా పార్వతీపురం పట్టణానికి చెందిన పడాల సంతోష్‌కుమార్ నిలిచాడు. బిలో 55 కేజీలు, 60, 65, 70, 75, 80, 85, 90 కేజీలు, మాస్టర్స్ బరువు కేటగిరీల్లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. బాడీబిల్డింగ్ చేయడంతో శారీరక ధారుఢ్యంతో పాటు అనారోగ్యాలకు దూరంగా ఉండవచ్చన్నారు.
శ్రీకాకుళంలో వరుసగా తొమ్మిదిసార్లు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి పదోసారి కూడా విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసిన విజయ్‌కుమార్ బృందాన్ని అభినందించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకరి కృష్ణకుమార్ మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహించడం విజయ్‌కే సాధ్యమైందన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షకు 26,887మంది హాజరు

విజయనగరం పూల్‌బాగ్: విజయనగరం ఉమ్మడి జిల్లాలో సోమవారం ఇంటర్మీడియట్ ఫస్టియర్ గణితం, సివిక్స్, బోటనీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 26,887 మంది విద్యార్థులు హాజరుకాగా 1773 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 6,121 మందికి 5,368 మంది హాజరయ్యారు. ఆర్‌ఐఓ రెండు, డీఈసీ నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. స్క్వాడ్ బృందాలు 45, మిగిలిన అధికారులు 8 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్టు ఆర్‌ఐఓ ఎం.సత్యనారాయణ తెలిపారు.

ఆరుబయట ప్రీ ఫైనల్ జవాబు పత్రాలు



బలిజిపేటలో షాపుల వద్ద భద్రపరిచిన జవాబు పత్రాలు

బలిజిపేట: బలిజిపేట ఉన్నత పాఠశాలలో ఇటీవల పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఇంగ్లిష్ సబ్జెక్టు ప్రీ ఫైనల్ పరీక్ష జవాబు పత్రాలు ఆరుబయట దర్శనమిచ్చాయి. వాటిని చూసిన వారంతా ఇదేం విడ్డూరమంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇటీవల పదవ తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించగా వాటిలో ఇంగ్లిష్ సబ్జెక్టుకు చెందిన 40 పేపర్ల కట్ట, 7వ తరగతి పరీక్షకు చెందిన 22 పేపర్ల కట్ట ఉన్నాయి. వాటిలో కొన్ని పేపర్లు దిద్దినప్పటికీ మరికొన్ని దిద్దాల్సి ఉంది. శుక్రవారం సాయంత్రం ఈ పేపర్లు ఉన్నత పాఠశాల ఆవరణలో దొరకడంతో వాటిని తీసుకువచ్చిన వారు మార్కెట్‌లో ఓ షాపువద్ద భద్రంగా ఉంచారు. విద్యార్థులు రాసిన జవాబుపత్రాలను ఇలా నిర్లక్ష్యంగా వదిలివేయడం ఏమిటని స్థానికులు గుసగుసలాడుకున్నారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజశేఖరరావు వద్ద 'సాక్షి' ప్రస్తావించగా చిన్న పొరపాటువల్ల ఇలా జరిగిందని, ఇకపై అలా జరగకుండా చూసుకుంటామన్నారు.

అసత్య ప్రకటనలు నమ్మవద్దు

- జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్



జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్

పార్వతీపురం టౌన్: ఆర్టీసీలో ఉద్యోగ నోటిఫికేషన్‌కు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రకటనలు వస్తున్నాయని వాటిని నమ్మవద్దని జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక డీపీటీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీలో 5,418 డ్రైవర్లు, కండక్టర్ల ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్ వచ్చిందన్న కథనాలు అవాస్తవమని స్పష్టం చేశారు. ఆర్టీసీ అధికారులు ఎటువంటి నోటిఫికేషన్ జారీ చేయలేదని తెలిపారు. ఆర్టీసీలో నోటిఫికేషన్ వెలువడితే పత్రిక ప్రకటన ద్వారా, వెబ్‌సైట్ల ద్వారా తెలియజేస్తామన్నారు. సైబర్ నేరగాళ్లు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని వారి మోసపూరిత ప్రకటనలకు ఆకర్షితులు కావద్దని హితవు పలికారు.

సుజలస్రవంతికి భూసేకరణ

- ఇన్‌చార్జి ఆర్డీఓ పద్మలత



స్పందన కార్యక్రమంలో వినతులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీఓ పద్మలత

బొబ్బిలి: సుజల స్రవంతి ప్రాజెక్టుకు అవసరమైన ఐదు వేలు ఎకరాల భూసేకరణ ప్రక్రియ జోరందుకుందని ఇన్‌చార్జి ఆర్డీఓ పి.పద్మలత తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తన యూనిట్ పరిధిలోని నాలుగు మండలాల్లో 2,700 ఎకరాలను సేకరిస్తున్నామన్నారు. ప్రాజెక్టు ద్వారా వచ్చే నీటిని సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. తోటపల్లి ప్రాజెక్టుకు సంబంధించి పిల్ల కాలువల నిర్మాణానికి నాలుగు ఎకరాల మినహా మిగిలిన భూ సేకరణ పూర్తయిందన్నారు.

సెంచూరియన్‌లో సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం



సెంచూరియన్‌లో పవర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో కొత్తగా ఏర్పాటు చేసిన 241.2 కిలోవాట్ సోలార్ పవర్‌ప్లాంట్‌ను కలెక్టర్ సూర్యకుమారి సోమవారం ప్రారంభించారు. అనంతరం వర్సిటీను సందర్శించి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. 25 ఏళ్లపాటు ప్లాంట్ నిరాటంకంగా పనిచేస్తుందని, దీనిపై పెట్టిన పెట్టుబడి కేవలం నాలుగేళ్లలో వెనక్కి వస్తుందని వర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- అగ్నిమాపకశాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్



కొండబారిడి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్

కురుపాం: గిరిజనులు ఆచరిస్తున్న చక్కని ఆహారపు అలవాట్లే వారి ఆరోగ్య రహస్యమని, చిరు ధాన్యాలు, పెరటిలో పండే కూరగాయల వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతోందని అగ్నిమాపకశాఖ డీజీ మాదిరెడ్డిప్రతాప్ అన్నారు. కురుపాం మండలంలో ప్రకృతివ్యవసాయం అమలులో ఉన్న వలసబల్లేరు, కొండబారిడి గిరిజన గ్రామాలను ఆయన సోమవారం సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతును గిరిజన మహిళా రైతులను అడిగి తెలుసుకున్నారు. దంపుడు బియ్యం కేంద్రాన్ని సందర్శించారు. తయారీ పద్ధతులు, ధరల వివరాలపై ఆరా తీశారు. గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులు, ఆచార సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లపై అధ్యయనం చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, గిరిజనుల ఆహారపు అలవాట్లు వారికి సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తున్నాయన్నారు. అమెరికా శాస్త్రవేత్తలు కూడా పరిశోధన చేసి ఈ విషయాన్ని గుర్తించారన్నారు. గిరిజనులు ఆహారంగా తీసుకునే గంటెలు, ఊదలు, రాగులు, జొన్నల్లో శరీరానికి కావాల్సిన పోషకాలు లభిస్తున్నాయని తెలిపారు. మరోవైపు రసాయనిక ఎరువులకు దూరంగా పెరటితోటలో పండించే ఆకుకూరలు, కాయగూరలతో ఆరోగ్యం సమకూరుతోందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్న కొండబారిడి గిరిజన రైతులను అభినందించారు. కార్యక్రమంలో జట్టు సంస్థ వ్యవస్థాపకుడు డి. పారినాయుడు, నీలకంఠాపురం ఎస్‌ఐ అనీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్సపొందుతున్న సింహాచలం

పార్వతీపురం: తాగి వచ్చినందుకు కొడుకు మందలించడంతో మనస్తాపం చెందిన కొమరాడ మండలం దుగ్గి గ్రామానికి చెందిన టి.సింహాచలం పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సోమవారం జరిగిన ఈ ఘటనపై పార్వతీపురం అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సింహాచలం ఇంటికి తాగి రావడంతో కుమారుడు వినోద్ ఎందుకు రోజూ తాగి వచ్చి న్యూసెన్స్ చేస్తున్నావని మందలించి పోతావా పోవా అంటూ కోపంగా అనడంతో మనస్తాపం చెందిన సింహాచలం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి చనిపోతానంటూ తాగేశాడు. అది గమనించిన కుమారుడు పురుగు మందుడబ్బాను లాక్కుని తాగిన మందు బయటకు వచ్చేలా ప్రయత్నించాడు. అనంతరం ద్విచక్రవాహనంపై చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించాడు.

పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి

విజయనగరం క్రైమ్: పెట్రోల్ పోయించుకునేందుకు వచ్చిన ముగ్గురు యువకులు పెట్రోల్ పోయించుకున్న తర్వాత డబ్బులు చెల్లించకుండా పరారయ్యేందుకు యత్నించారు. అడ్డుకున్న సిబ్బందిపై దౌర్జన్యం చేశారు. బంకు సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అక్కడకు చేరుకున్నారు. సీసీ ఫుటేజీని పరిశీలించి ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై జిల్లా పెట్రోల్ బంకుల యాజమాన్య అసోసియేషన్ అధ్యక్షుడు జి.నాగిరెడ్డి సోమవారం మాట్లాడుతూ.. ఇటీవల ఇటువంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని, దీనిపై పోలీసుశాఖ దృష్టి సారించి పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం



గ్యాస్ సిలెండర్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

విజయనగరం క్రైమ్: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సచివాలయ వలంటీర్లకు అగ్నిమాపకశాఖ అధికారులు అవగాహన కల్పించారు. స్థానిక కణపాత యూత్ హాస్టల్‌లో సోమవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చిన వలంటీర్లకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.కోట అగ్నిమాపక శాఖాధికారి మదీనా, విజయనగరం ఏఎస్ఎఫ్ఓ కె.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రమాదం జరిగినపుడు ఆందోళన చెందకుండా అప్రమత్తతతో వ్యవహరిస్తే ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడొచ్చన్నారు.

అర్జీదారుకు నాణ్యమైన సమాధానమివ్వాలి

- కలెక్టర్ సూర్య కుమారి
- స్పందనకు 149 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎం.సూర్యకుమారి



బాధితుల సమస్యలను వింటున్న ఎస్పీ దీపిక

విజయనగరం అర్బన్: ప్రతి రోజూ అధికారులు వారి లాగిన్‌లో వినతులను చూడాలని, అర్జీ దారులకు నాణ్యమైన సమాధానాలను ఇవ్వాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. రీ ఓపెన్ వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టి అర్థవంతమైన సమాధానాలను ఇవ్వాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనకు ప్రజల నుంచి 149 వినతులు అందాయి. వాటిలో వైద్య శాఖకు 10, డీఆర్‌డీఏకు 7, హౌసింగ్‌కు 6, మున్సిపల్ శాఖకు 6 అర్జీలు అందగా అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 108 వినతులు, మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి అందాయి. ముఖ్యంగా సదరం, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, భూ సమస్యలు, గృహాల కోసం విజ్ఞప్తులు వచ్చాయి. ఈ వినతులను కలెక్టర్ ఎ.సూర్య కుమారి, జేసీ మయూర్‌అశోక్, ఉపకలెక్టర్లు సుదర్శన దొర, సూర్యనారాయణ, పద్మావతి స్వీకరించారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు

విజయనగరం క్రైమ్: స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో సామాన్య ప్రజల నుంచి 50 ఫిర్యాదులను స్వీకరించి, వారిసమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని, ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, దిశ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, ఎస్బీ సీఐలు జి.రాంబాబు, రుద్రశేఖర్, ఎస్సై వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అడవులతో ఆరోగ్యకర జీవనం

- విజయనగరం జిల్లాలో 6 శాతమే అడవులు
- జిల్లా విభజన తరువాత తగ్గిన విస్తీర్ణత శాతం
- జిల్లా వ్యాప్తంగా 5 లక్షల మొక్కలు పంపిణీకి ఏర్పాట్లు
- ఇప్పటికే 1.40 లక్షల మేర పంపిణీ
- నేడు అటవీదినోత్సవం



రాజాం: మనిషికి ప్రాణవాయువును అందించేవి చెట్లు. వాటిపైనే మానవ జీవనం ఆధారపడి ఉంది. పర్యావరణ సమతుల్యతకు అడవులే ప్రధానం. వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 18 శాతం (విజయనగరంలో 6శాతం, పార్వతీపురం మన్యంలో 12 శాతం) అటవీ విస్తీర్ణం ఉంది. ఇది 33 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని అటవీశాఖ అధికారులు స్పష్టంచేస్తున్నారు. అటవీ విస్తీర్ణం పెరిగిన నాడు వన్యప్రాణాలు జనసంచార ప్రాంతాల్లోకి రావని, పంటలు నాశనం చేసే అవకాశం ఉండదని చెబుతున్నారు. ఈ నెల 21న అటవీదినోత్సవాన్ని పురస్కరించుకుని అడవుల ప్రాధాన్యంను ఊరూరా వివరించేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో పచ్చదనం పెంచేలా...

విజయనగరం జిల్లాలో అటవీశాతం పెంచేందుకు అవకాశం లేదు. ఎక్కువ వ్యవసాయాధారిత భూములే ఉన్నాయి. 6 శాతం ఉన్న అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు జిల్లా అటవీశాఖ వినూత్న ప్రయోగాలు చేస్తోంది. గతేడాది 5 లక్షలు మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకుంది. 40 వేల మొక్కలను రహదారులు, చెరువు గట్లు, పొలాలు గట్లపై నాటేందుకు పంపిణీచేసింది. నర్సరీలు ద్వారా రైతులు పంటపొలాల్లో వేసేందుకు 50 వేల మొక్కలు మేర పంపిణీ చేయగా, నగర వనాలు పథకానికి మరికొన్ని మొక్కలను అందజేసింది. వీటితో పాటు ఉపాధి హామీ పథకం కింద మరో 50 వేల మొక్కలు పంపిణీ చేసి సంరక్షించే చర్యలు చేపట్టింది. జిల్లాలో పూల్‌బాగ్, వెలగాడ, గంటికొండ, మారిక, కోనూరు తదితర ప్రాంతాల్లో అడవులు విస్తీర్ణం అధికంగా ఉంది. సారిపల్లి వద్ద నగర వనం కార్యక్రమాన్ని గతేడాది జిల్లా ఫారెస్ట్ శాఖ ప్రారంభించింది. మరోవైపు టేకు, చందనం మొక్కల పెంపకానికి రైతులను ప్రోత్సహిస్తున్నట్టు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.వెంకటేష్ తెలిపారు.

సకాలంలో వినతుల పరిష్కారం



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: స్పందన కార్యక్రమంలో ప్రజలు సమర్పించే వినతులను సకాలంలో పరిష్కరిచాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ కోరారు. ఈ మేరకు స్పందన కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్, సంయుక్త కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణురణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు ప్రజలనుంచి 75 అర్జీలను స్వీకరించారు. అలాగే దివ్యాంగులకోసం కలెక్టరేట్‌లోని సెల్లార్‌లో ఏర్పాటుచేసిన స్పందన కార్యక్రమంలో డీఆర్ఓ వెంకటరావు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ చేశారు.

ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలి

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వారి సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టామన్నారు. ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ ఎస్బీ సీఐ ఎస్.శ్రీనివాస రావు, ఎస్సై దినకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మరో 28 మందికి ఆర్‌ఆర్ ప్యాకేజీ

భోగాపురం: భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణంలో భాంగగా గృహాలు కోల్పోయిన బొల్లింకలపాలెం, ముడసర్లపేట, రెల్లిపేట, మరడపాలెం గ్రామాలకు చెందిన సుమారు 376 కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించింది. గూడెపువలస, పోలిపల్లి రెవిన్యూ పరిధిలో సువిశాలమైన 5 సెంట్లు భూమితో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.9.20 లక్షలు అందజేసింది. నిర్వాసిత కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. అయితే, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ 2013 చట్టం ప్రకారం 2015 నాటికి గృహాలు కోల్పోయిన వారి కుటుంబంలో18 ఏళ్లు నిండిన వారికి వర్తింపజేసి, నష్ట పరిహారంతో పాటు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ బొల్లింకలపాలెం, రెల్లిపేట, ముడసర్లపేట, మరడపాలెం గ్రామాలకు చెందిన మొత్తం 28 నిర్వాసితులకు ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు 5 సెంట్లు ఇళ్ల స్థలాలను మంజూరుచేస్తూ సోమవారం ప్రభుత్వం జీఓ జారీ చేసింది. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు విమానాశ్రయ నిర్వాసిత గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తు తిరస్కరణకు కారణం చెప్పాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

- బ్యాంకర్స్ సమావేశంలో కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఈనెలాఖరులోగా ప్రభుత్వ పథకాలను మంజూరు చేసి గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి బ్యాంకర్లను ఆదేశించారు. దీని కోసం వారం రోజుల్లో యుద్ధప్రాతిపదికన బ్యాంకుల వద్ద ఉన్న పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి ఆమోదించాలని స్పష్టం చేశారు. బ్యాంకుల వారీగా తిరస్కరించిన దరఖాస్తుల సంఖ్య, అందుకు కారణాలపై ఆరా తీశారు. కొన్ని బ్యాంకులు అధిక సంఖ్యలో దరఖాస్తులను తిరస్కరించడం, పెండింగ్‌లో పెట్టడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ దరఖాస్తును తిరస్కరించినా, అందుకు కారణాలను దరఖాస్తుదారునికి తెలియజేయాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తిరస్కరించిన దరఖాస్తులను కూడా మరోసారి పునః పరిశీలించాలని కోరారు. సోమవారం కలెక్టర్ ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ అర్హత ఉన్న వారికి రుణాలు ఇచ్చి ప్రోత్సహించాల్సిన బాధ్య త బ్యాంకర్లపై ఉందన్నారు. ప్రతి బ్యాంకుకు ఇచ్చిన లక్ష్యాల మేరకు ఆయా పథకాలను రుణాలను ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. మరో పదిరోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా దరఖాస్తులు పెండింగ్ ఉండడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జేసీ కె. మయూర్ అశోక్, ఎల్‌డీఎం శ్రీనివాసరావు, నాబార్డు డీడీఎం నాగార్జున, జెడ్పీ సీఈవో ఎం.అశోక్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ బి.సుధాకరరావు, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ వై.వి.రమణ, మత్స్యశాఖ అధికారి నిర్మలాకుమారి, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు, పరిశ్రమల శాఖ జీఎం పాపారావు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితులకు 80 మొబైల్స్ అందజేత



రికవరీ చేసిన ఫోన్‌ను బాధితురాలికి అందజేస్తున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లాలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్‌ను ట్రేస్ చేసేందుకు పోలీస్‌శాఖ ప్రవేశపెట్టిన వాట్సాప్ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 80 స్మార్ట్ ఫోన్‌లను రికవరీ చేసినట్లు ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వివరాలను వెల్లడించి, బాధితులకు ఫోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగరం మొబైల్ ట్రాకర్ డాట్ ఇన్ వెబ్‌సైట్, వాట్సాప్ నంబర్ 8977945606కు వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, రూ.13.88 లక్షల విలువైన 80 ఫోన్‌లను రికవరీ చేయగలిగామన్నారు. మనరాష్ట్రంలోని ఇతర జిల్లాలు, ఒడిశా, ఝార్ఖండ్, బీహార్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్న వారు పోయిన మొబైల్స్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. సైబర్‌సెల్ పోలీసులు మొబైల్ వినియోగిస్తున్న వారితో మాట్లాడి, ఆయా ప్రాంతాల నుంచి వాటిని రికవరీ చేశామన్నారు. రికవరీ చేయడానికి ఎంతో శ్రమించి, పనిచేసిన సైబర్ సెల్ ఎస్సై ఎం.ప్రశాంత్‌కుమార్, కానిస్టేబుళ్లు బి.వాసుదేవరావు, ఎం.శ్రీనివాసరావు, ఎస్.రాజేష్, టి.తిరుపతినాయుడులను ఎస్పీ అభినందించారు. రికవరీ చేసిన 80 మొబైల్స్‌ను ఎస్పీ ఎం.దీపిక చేతులమీదుగా బాధితులకు తిరిగి అందజేయడంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది. కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ జి.రాంబాబు, ఎస్సైలు ప్రశాంతకుమార్, నసీమాబేగం, సాగర్‌బాబు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹ 180

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం



చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను పరిశీలిస్తున్న జేసీ మయూర్‌అశోక్

విజయనగరం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పోషకాహారం అందించాలని జేసీ మయూర్ అశోక్ ఆదేశించారు. స్పందన హాల్ వద్ద ఐసీడీఎస్ పోషణ్ పక్వాడాలో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను సందర్శించారు. పిల్లలకు, మహిళలకు అందించే పాలప్యాకెట్‌లను తనిఖీ చేశారు. గడువు తేదీని పరిశీలించి పాలప్యాకెట్లు తీసుకోవాలన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం నాణ్యతపై ఆరా తీశారు. రాగులు, జొన్నలు తదితర చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను తిలకించారు. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 3 వరకు 15 రోజులపాటు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నట్టు ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి జేసీకి వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ ప్రసన్న, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



కాలిపోయిన పూరిల్లు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రెల్లి వీధిలో కుంపటి నిప్పులు తాటి కమ్మలకు అంటుకోవడంతో గ్రామానికి చెందిన ధనాల లక్ష్మి పూరిల్లు దగ్ధమైనట్లు వీఆర్వో కూర్మారావు సోమవారం తెలిపారు. నిరుపేద అయిన లక్ష్మి రైల్వే ట్రాక్ వద్ద జొన్న పొత్తులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. అగ్ని ప్రమాదం జరగంతో ఇంటిలో ఉన్న సామగ్రితో పాటు కొంత నగదు కాలి బూడిదై రూ.ముప్పై వేల వరకు ఆస్తినష్టం జరిగిందని ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు వీఆర్వో తెలిపారు.

ట్రాక్టర్ల చోరీ నిందితుల అరెస్ట్

- ట్రాక్టర్ ఇంజిన్, మూడు ట్రక్కులు, రూ.4.50 లక్షల రికవరీ



కేసు ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన అధికారులు, సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక



రికవరీ చేసిన ట్రాక్టర్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైమ్: జిల్లాలో ట్రాక్టర్ల దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఒక ట్రాక్టర్ ఇంజిన్, మూడు ట్రక్కులు, రూ.4.50 లక్షలు నగదు రికవరీ చేసినట్లు ఎస్పీ ఎం.దీపిక స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని ఎస్.కోట, ఎల్.కోట, జామి, డెంకాడ, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ట్రాక్టర్ దొంగతనాలను దృష్టిలో పెట్టుకుని, ఈ తరహా నేరాలను నియంత్రించేందుకు కేసుల మిస్టరీని ఛేదించేందుకు ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు నేతృత్వంలో సీసీఎస్, జామి, ఎస్.కోట పోలీసులతో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. ఈ బృందాలు ఈ తరహా నేరాలకు పాల్పడిన నేరస్తులను రాష్ట్రవ్యాప్తంగా విచారణ చేసి, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టాయి. జామి మండలం అలమండ రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న శ్రీకాకుళపు నాగరాజు అనే వ్యక్తిని జామి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, తాను, కొత్తవలస మండలం వియ్యంపేటకు చెందిన నాగులాపల్లి గణేష్, మరో జువైనల్ సహకారంతో బృందంగా ఏర్పడి, ఊరికి చివరగా ఉన్న వ్యవసాయ కళ్లాల్లో ఉన్న పాత ట్రాక్టర్లను దొంగిలించి, వాటి రూపురేఖలు మార్చి చేసి, స్క్రాప్ షాపులకు విక్రయించేవారని తెలిసింది.

అప్పుల బారి నుంచి బయటపడేందుకు..

నిందితులు ఇటుక బట్టీల్లో పనిచేస్తూ, బట్టీ యజమానుల దగ్గర అడ్వాన్సుగా డబ్బులు తీసుకుని, తిరిగి చెల్లించకపోవడంతో అప్పులబారిన పడ్డారు. అప్పుల బారినుంచి బయట పడేందుకు గాను జామి మండలంలో ఒకటి, ఎస్.కోట మండలంలో రెండు, ఎల్.కోట మండలంలో ఒకటి, డెంకాడ మండలంలో ఒకటి, విజయనగరం మండలంలో మరొకటి వెరసి మొత్తం ఆరు ట్రాక్టర్లను దొంగిలించినట్లు పోలీసుల విచారణలో నిందితులు వెల్లడించారు. ఈ కేసుల్లో గణేష్‌ను అరెస్టు చేసి, ఒక ట్రాక్టర్ ఇంజిన్, మూడు ట్రక్కులు, ట్రాక్టర్లను స్క్రాప్ షాపులకు విక్రయించిన నగదులో రూ.4.050 లక్షలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ నేరాల్లో రూరల్ పీఎస్‌కి చెందిన మరో ట్రాక్టర్‌ను కడపకు చెందిన బాలకృష్ణారెడ్డి అనే వ్యక్తి నుంచి రికవరీ చేయాల్సి ఉంది. ఆరు కేసుల్లో ఎటువంటి ఆధారాలు లభించనప్పటికీ జామి ఎస్సై జి.వీరబాబు, సీసీఎస్ ఎస్సై బి.సాగర్‌బాబు, ఎస్.కోట ఎస్సై జె.తారకేశ్వరరావు, సీసీఎస్ ఏఎస్సై ఎ.గౌరీశంకరరావు, హెడ్ కానిస్టేబుల్లు దాసరి శంకరరావు, మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్, జి.మహేశ్వరరావు, ఎస్.ఈశ్వరరావు, కానిస్టేబుళ్లు ఎం.చిరంజీవిరాజు, ఎస్.రమణ, ఎస్.గౌరీశంకర్, హోంగార్డు జె.నారాయణరావులు ఎంతో శ్రమించి కేసుల మిస్టరీని ఛేదించారు. ఈ సందర్భంగా వారిని ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో విజయనగరం డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ జి.రాంబాబు, ఎస్సైలు జి.వీరబాబు, బి.సాగరబాబు, ప్రశాంతకుమార్, నసీమా బేగం, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.